క్లుప్తంగా

అధ్వానంగా అల్లీపురం పీహెచ్‌సీ



పీహెచ్‌సీ ప్రాంగణమిలా..

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని అల్లీపురం పీహెచ్‌సీ ప్రాంగణం అధ్వానంగా ఉంది. మంగళవారం సాక్షి విజిట్‌లో పలు విషయాలు వెలుగు చూశాయి. పిచ్చిచెట్లు పెరిగిపోవడంతో విషకీటకాలు, పాములు సంచరిస్తున్నాయి. దీంతో వైద్యం కోసం వచ్చిన రోగులు భయాందోళన చెందుతున్నారు. అదే విధంగా పీహెచ్‌సీలో సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులున్నాయి.

'ఇస్రో'కు కళా వందనం



నెల్లూరు(బృందావనం): ఇస్రో వందో ప్రయోగానికి సిద్ధమైన వేళ నగరంలోని బ్రాహ్మణవీధికి చెందిన సూక్ష్మ కళాకారుడు, ఉపాధ్యాయుడు గంధవళ్ల ఉమాశంకర్ మర్రి ఆకుపై చిత్రాన్ని రూపొందించారు.

ప్రశంసాపత్రాల అందజేత



తిరుపతయ్యకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న జేసీ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీబొమ్మసెంటర్ వద్ద ఉన్న డీసీసీబీలో మంగళవారం మహాజన సభ నిర్వహించారు. దీనికి జేసీ, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి కార్తీక్ హాజరయ్యారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన జిల్లా సహకార ఆడిట్ అధికారి తిరుపతయ్య, జిల్లా ప్రాజెక్ట్ అభివృద్ధి మేనేజర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, డీసీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌సాయిలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఐఆర్‌ఎంపీడబ్ల్యూఏ జిల్లా సమావేశం

- కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రమణమూర్తి



రమణమూర్తి

నెల్లూరు(బృందావనం): నెల్లూరు పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్లో మంగళవారం ఇండియన్ రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఐఆర్‌ఎంపీడబ్ల్యూఏ) జిల్లా శాఖ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఆ అసోసియేషన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు కె.రవిచంద్ర, కె.హేమసుందర్ పాల్గొన్నారు. గతంలోలా ప్రభుత్వం ఆర్‌ఎంపీలను గుర్తించి వారికి తగిన రీతిలో శిక్షణ అందించాలన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసరమైన ప్రథమ చికిత్సను అందించి వారి ప్రాణ రక్షణకు ఎంతో తోడ్పడగలరన్నారు. శిక్షణ పొందిన ఆర్‌ఎంపీలతో ప్రజలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఒట్టికాయల రమణమూర్తి, ఉపాధ్యక్షుడిగా నాగరాజారావు, కార్యదర్శిగా రూతమ్మ, సహాయ కార్యదర్శిగా శివ, కార్యవర్గసభ్యుడిగా సీహెచ్ దామోదర్‌లు నియమితులైనట్లు ఆ అసోసియేషన్ నేతలు ప్రకటించారు.

నేటి నుంచి ఇంటర్వ్యూలు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని మైపాడురోడ్డు, జాఫర్‌సాహెబ్ కాలువ, సత్యనారాయణపురం నుంచి మైపాడు గేట్ కూడలి వరకు 200 షాపులను తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయా తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. టౌన్ వెండింగ్ కమిటీ (టీవీసీ) ఆధ్వర్యంలో ఇవి జరుగుతాయన్నారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ తదితర గుర్తింపు కార్డులతో హాజరుకావాలన్నారు.

ప్రయాణం.. ప్రమాదం



నెల్లూరులో జాతీయ రహదారిపై ఇలా..

- రహదారులను కమ్మేస్తున్న పొగమంచు
- ఉదయం 8 గంటల వరకూ వీడని వైనం
- లైట్లు వేసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి
- వాహనదారులూ.. జాగ్రత్తలు తప్పనిసరి

➡ జిల్లా వ్యాప్తంగా ఎన్‌హెచ్ 16 (కోల్‌కత్తా - చెన్నై), ఎన్‌హెచ్ 67 (కృష్ణపట్నం - బద్వేల్)లపై 42 ప్రమాదకర ప్రాంతాలున్నాయి.

➡ పొగమంచు కారణంగా మంగళవారం తెల్లవారుజామున ఆత్మకూరు - బట్టేపాడు మార్గంలో ట్రాక్టర్ కాలువలో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి.

నెల్లూరు(క్రైమ్): దట్టంగా కురుస్తున్న పొగమంచు వాహనదారులను భయపెడుతోంది. ఉదయం 8 గంటలకు కూడా మంచు వీడటం లేదు. రోజురోజుకూ పెరుగుతోన్న పొగమంచు వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. ప్రయాణ సమయంలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశముంది. గతంలో ఈ కాలంలోనే అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని సంవత్సరాల క్రితం ఓ తెల్లవారుజామున నెల్లూరు ఎన్టీఆర్ నగర్ వద్ద హైవేపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో నలుగురు మృత్యువాతపడ్డారు. మంచుతెరలు కమ్ముకున్నా ప్రజలు విధులు, బాధ్యతలు, అత్యవసర కార్యక్రమాల కోసం ప్రయాణించక తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

జాగ్రత్తలు తప్పనిసరి

➡ పొగమంచులో ప్రయాణించేవారు ముందుగా వాహనాల హెడ్‌లైట్ల పనితీరును చెక్ చేసుకోవాలి. ఒక లైటు మాత్రమే పనిచేస్తున్నా, తక్కువ కాంతితో వెలుగుతున్నా వెంటనే సరిచేయించాలి. రెడ్‌సిగ్నల్స్, బ్రేక్ సిగ్నల్స్ సరిగ్గా పనిచేస్తున్నాయా? లేదా? అని సరిచూసుకోవాలి.

➡ దట్టమైన మంచు కురిసే సమయంలో వీలైనంత వరకూ వాహనాలు నడపరాదు.

➡ ప్రయాణ సమయంలో పొగమంచు తీవ్రత పెరిగితే ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపకుండా సురక్షిత ప్రాంతాలు, హైవే అథారిటీ ఏర్పాటు చేసిన రెస్ట్ ఏరియాల్లో పార్కింగ్ చేయాలి.

➡ కార్లు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం సాధ్యమైనంత తక్కువ దూరం, తప్పనిసరి అయితేనే వెళ్లాలి.

➡ కారు (విపత్తు హెచ్చరిక) నాలుగువైపులా ఉన్న లైట్లను ఆన్ చేయాలి. దీంతో రహదారిపై కారు ఉనికిని ఇతర వాహనాలు గుర్తించే అవకాశం ఉంటుంది.

➡ పొగమంచులో వెళ్లే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలపై దృష్టి సారిస్తూ చేతులను స్టీరింగ్‌పైనే ఉంచాలి. వేగం తగ్గించాలి. మలుపుల వద్ద అప్రమత్తంగా ఉండాలి. వాహనచోదకులు గుర్తించేలా హెడ్‌లైట్స్ ఆన్‌చేసి ఉండాలి.

➡ తెల్లవారుజామున, ఉదయం పూట మంచు కురుస్తున్నా తప్పనిసరిగా ప్రయాణించాల్సిన పాలు, న్యూస్‌పేపర్ తరలించే వాహనాలు, వ్యవసాయ కూలీలను తీసుకెళ్లే ట్రాక్టర్లు, ఆటోలు, ప్రైవేట్ బస్సులు వంటి వాటికి ఫాగ్‌లైట్స్ అమర్చుకోవడం మంచిది.

➡ కార్లలోని డీఫాగర్‌ను ముందుగానే ఆన్‌చేయాలి. ఆపైబడిన చక్రాల వాహనాలకు వైపర్స్ పనిచేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి.



లైట్లు వేసుకుని వెళ్తూ..

➡ జాతీయ, రాష్ట్రీయ రహదారులపైనే ఉన్న రేడియం లైటింగ్ గుర్తులను అనుసరిస్తూ వాహనం నడపాలి.

➡ ముందున్న వాహనానికి తగినంత దూరాన్ని పాటించాలి. అధిగమించే ప్రయత్నం చేయరాదు. దీంతో ఆ వాహనాలు పొరపాటున ప్రమాదానికి గురైతే వెంటనే మనం పక్కకు తప్పుకొనే అవకాశం ఉంటుంది.

➡ మద్యం మత్తులో వాహనం నడపడం ప్రమాదకరం.

➡ పొగమంచు కురుస్తున్న సమయంలో రహదారులు తడిగా ఉంటాయి. ద్విచక్ర వాహనదారులు ఒక్కసారిగా బ్రేక్ వేస్తే జారిపడే అవకాశం ఉంటుంది. అందువల్ల పరిమిత వేగంతో ఉండాలి.

కారణాలివే..

సాధారణ రోజుల్లో ప్రయాణాలకు పొగమంచు కురుస్తున్న వేళల్లో ప్రయాణాలకు చాలా తేడా ఉంది. దట్టంగా అలుముకున్న మంచు వల్ల వాహనచోదకులకు మార్గం, ఎదురు వాహనాలు కనిపించకపోవడం, రహదారులపై సూచించిన దాని కంటే అధిక వేగంగా నడపడం, ఇష్టానుసారంగా వాహనాలు నిలిపి ఉండటం అధికశాతం ప్రమాదాలకు కారణాలని అధికారులు భావిస్తున్నారు.

నేతన్నల కడుపు కొట్టొద్దు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఇక్కడ చేనేత వస్త్రాలు తయారు చేసే అవకాశాలున్నా జౌళి శాఖ అధికారులు ఇతర రాష్ట్రాలపై మోజు చూపిస్తూ అవినీతికి పాల్పడి నేతన్నల కడుపు కొడుతున్నారని, ఇది తగదని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వెంకటగిరి, పాటూరు, నారాయణరెడ్డిపేట, సంగం, కావలి, జమ్మారం, వింజమూరు, గూడూరు, చెన్నూర్, ములుముడి, సౌత్ మోపూరు, గుమ్మళ్లదిబ్బ, ఇంకా ధర్మవరం, మంగళగిరి, చీరాల తదితర చోట్ల చేనేత వస్త్రాలు తయారు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ నుంచి వస్త్రాల సేకరణలో ఎవరి హస్తముందో బహిర్గతం చేయాలని కోరారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదులు అందాయన్నారు. నేతన్నలు ఆప్కోకు వస్త్రాలు సరఫరా చేస్తామని అడిగేందుకు వెళ్తే కనీసం లోనికి అనుమతించకపోవడం సిగ్గుచేటన్నారు. 3 లక్షల మంది పైగా చేనేతలు, 2 లక్షల పైగా మగ్గాలుంటే కనీసం నూలు, ముడిసరుకులు అందించకుండా ఈ రంగాన్ని ఆ శాఖ నిర్వీరం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ – 1 అధికారులు మంగళవారం దాడులు చేశారు. శివాజీనగర్‌లో అనధికార మద్యం విక్రయాలకు పాల్పడుతున్న అదే ప్రాంతానికి చెందిన జి.క్రాంతిని అరెస్ట్ చేశారు. అతడి వద్ద 20 క్వార్టర్ల కేరళ మాల్ట్ ఫైన్ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సదరు మద్యం ఏ మద్యం షాపులో కొనుగోలు చేశాడనే వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఎస్.ప్రభాకర్‌రావు, కానిస్టేబుల్ ఎం.రాజాజీ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): 'బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం మానుకోవాలి. చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలి' అని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. మంగళవారం 44వ డివిజన్ పరిధిలోని పెద్దబజారు, ముంగమూరువారివీధి, బారకాసు రోడ్డు, రాయాజీవీధి, తిప్పరాజువారి వీధి, కలెక్టరేట్ తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారిని గుర్తించి హెచ్చరించాలన్నారు. మళ్లీ అదే విధంగా చేస్తే భారీగా జరిమానాలు విధించాలని ఆదేశించారు. రోడ్లపై పార్క్ చేసిన నిరుపయోగ వాహనాలను గుర్తించి ట్రాఫిక్ పోలీస్ విభాగం దృష్టికి తీసుకెళ్లి వాటిని వెంటనే తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై వాహనాల పార్కింగ్ మానుకోవాలన్నారు. డివిజన్ పరిధిలో కాలువల్లో పూడికతీత పనులు క్రమం తప్పకుండా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. చిన్నబజార్ ప్రాంతంలో పాతకూరగాయల మార్కెట్ ప్రాంతంలో పశువుల సంచారాన్ని నియంత్రించేలా గేట్లు ఏర్పాటు చేయాలన్నారు.



చిన్నబజార్ వద్ద పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

మహబూబ్‌ఖాన్ పార్కులో లైటింగ్, పచ్చదనం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామమోహన్‌రావు, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఏడీహెచ్ ప్రదీప్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల మూసివేతను ఆపాలని డిమాండ్

నెల్లూరు(టౌన్): హేతుబద్ధీకరణ పేరుతో పాఠశాలల మూసివేతను నిలిపివేయాలని బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణిసుబ్బు, ప్రసాద్‌లు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 117 జీఓను రద్దు చేయాలని కోరితే అందుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాలలను రద్దు చేయడాన్ని బీటీఏ వ్యతిరేకిస్తోందన్నారు. 60 మంది కంటే ఎక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను హైస్కూల్స్‌గా ఉన్నతీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను ఎత్తివేసే పనికి పూనుకోవడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. చాలా ప్రాథమికోన్నత బడుల్లో 60 కంటే ఎక్కువ మంది పిల్లలున్నా వాటిని అప్‌గ్రేడ్ చేయకుండా ఏదో ఒక సాకు చూపి అడ్డుకోవడం బడుగు, బలహీనవర్గాలకు విద్యను దూరం చేసే కుట్రలో భాగంగా అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉండే స్కూళ్లను విలీనం చేయడం వల్ల ఆ సామాజికవర్గాలకు చెందిన పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.

'రంగడి' సన్నిధిలో బంగారు గరుడసేవ ఉత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): తై అమావాస్య సందర్భంగా రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు బంగారు గరుడసేవ ఉత్సవం జరుగుతుందని ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకోవాలని కోరారు.

ఫిబ్రవరి ఒకటి నుంచి 'దత్తక్షేత్ర యాత్ర'

- సింహపురికి రానున్న దత్త పీఠాధిపతి

నెల్లూరు(బృందావనం): మైసూరు అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ 'దత్తక్షేత్ర యాత్ర 2025' ఫిబ్రవరి ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు జరుగుతుందని శ్రీకృష్ణయోగ మందిరం, శ్రీఅష్టలక్ష్మి మందిరం అవధూత దత్త పీఠం నెల్లూరు శాఖ, ఎస్‌జీఎస్‌కేజీబీఎస్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. ఏసీ స్టేడియం దగ్గర ఉన్న సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరం, శ్రీఅష్టలక్ష్మి మందిరం ప్రాంగణంలో ఆహ్వానపత్రికలను ట్రస్టీలు అనపల్లి మస్తాన్‌రెడ్డి, దేశభట్ల ఫణిరత్నం తదితరులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ సచ్చిదానంద స్వామీజీతోపాటు అవధూత దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీ సాగిస్తున్న దత్తక్షేత్ర యాత్ర శనివారం సాయంత్రం నెల్లూరు నగరానికి చేరుకుంటుందన్నారు. ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నెల్లూరు ఎస్‌జీఎస్ భజన బృందంచే సచ్చిదానంద స్వామీజీ దివ్యనామ సంకీర్తనలతో సంగీత సేవ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు దేశవిదేశాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన 'కృష్ణామృత రాగ సాగర' (మ్యూజిక్ ఫర్ మెడిటేషన్, హీలింగ్) నాద ధ్యాన చికిత్సా కచేరి జరుగుతుందన్నారు. వసంత పంచమి సందర్భంగా సోమ, మంగళవారాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో స్వామీజీ భక్తులు డి.శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఈశ్వరయ్యలు పాల్గొన్నారు.



ఆహ్వానపత్రికల ప్రదర్శన

ప్రజా సమస్యలపై ఉద్యమాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రజా సమస్యలపై ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సీపీఎం రాష్ట్ర మహాసభల్లో నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం ముత్తుకూరుగేట్ సెంటర్‌లో సింహపురి సాంస్కృతిక కార్యక్రమాలను సీపీఎం, ప్రజానాట్య మండలి వారు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం విచ్చేసి మాట్లాడారు. వచ్చే నెల 3వ తేదీన వీఆర్సీ మైదానంలో నిర్వహించే భారీ బహిరంగసభలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కోలాటం, జానపద నృత్యాలు, గిరిజన నృత్యం, 'ఏ కులం నీది' నాటకంతోపాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. సభాధ్యక్షురాలిగా రెహానాబేగం వ్యవహరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహన్‌రావు, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు మంగరాజు, జిల్లా అధ్యక్షుడు వేణు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, జిల్లా నాయకులు పుల్లయ్య, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఇంకా నాగేశ్వరరావు, సూర్యనారాయణ, కాయల శ్రీనివాసులు, మస్తాన్‌బీ, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

లార్వా, ఫీవర్ సర్వే పరిశీలన

నెల్లూరు(అర్బన్): నగరంలోని బీవీ నగర్ - రోశిరెడ్డి కాలనీలో అనుమానిత డెంగీ జ్వరం నమోదైన నేపథ్యంలో ఆ ప్రాంతంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో లార్వా, ఫీవర్ సర్వే జరిగింది. ఈ సర్వేను మంగళవారం మలేరియా నివారణ శాఖ సహాయ అధికారి నాగార్జునరావు పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నీటి వనరులను పరిశీలించారు. ఆ ప్రాంతంలో మలాథియాన్ స్ప్రే చేయించారు. సేకరించిన లార్వాలను పరీక్ష కోసం ల్యాబ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు, ఆవరణలో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న నాగార్జునరావు తదితరులు

వైద్యశాఖలో మార్పులు

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్య శాఖలోడీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుజాత ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. బాధ్యతలు తీసుకున్న వారంలోపే కార్యాలయంలో పని చేస్తున్న పలువురి డిప్యుటేషన్లు రద్దు చేశారు. అంతే కాకుండా దీర్ఘకాలంగా ఒకే సీట్లో ఉన్న వారికి మంగళవారం స్థాన చలనం కలిగించారు. ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ఉన్న రషీద్‌ను ఎష్టాబ్లిష్ సెక్షన్‌ను మార్చారు. మరొక విభాగంలో సూపరింటెండెంట్‌గా ఉన్న విజయకుమారిని అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్‌గా నియమించారు. సీనియర్ అసిస్టెంట్ కేవీ శ్రీకాంత్‌ను ఈ-1 సెక్షన్‌కు, బి.శ్రీనివాసులును ఈ-2కి మార్చారు. సీనియర్ అసిస్టెంట్ నాగరాజుకు ఏ-1, బడ్జెట్స్, ఆడిట్స్, స్టేషనరీ బాధ్యతలు అప్పగించారు. మొత్తం 15 మందిని మార్చి నూతన విధులు కేటాయించారు.

ఎన్నికల అధికారిగా డీపీఓ

నెల్లూరు(పొగతోట): బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న రెండు వైస్ చైర్మన్ పదవుల భర్తీకి ఎన్నికల అధికారిగా డీపీఓ శ్రీధర్‌రెడ్డిని నియమిస్తూ ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రెండు పదవులను భర్తీ చేయనున్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

సస్పెన్షన్‌కు గురైన ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ కార్యదర్శి చక్రవర్తిపై వచ్చిన అవినీతి అభియోగాలపై జెడ్పీ సీఈఓ విద్యారమ విచారణ చేపట్టారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆమె విచారణ నిర్వహించారు.

మంత్రికి వినతి

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని మంగళవారం విజయవాడలో కలిశారు. కనిగిరి రిజర్వాయర్ అభివృద్ధితోపాటు, పలు విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

డీకేడబ్ల్యూలో జాబ్‌మేళా

నెల్లూరు(టౌన్): స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 21 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గిరి తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, ఫ్లిప్‌కార్ట్, అపోలో ఫార్మసీ, ఎస్‌బీఐ కార్డ్స్ కంపెనీల నిర్వహించిన ఇంటర్వ్యూలకు 44 మంది హాజరయ్యారన్నారు. వీరిలో 21 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూం, ప్లేస్‌మెంట్ అధికారి జనార్దన్, స్కిల్ హబ్ ఇన్‌చార్జి రంజని, ఉమా సుమాలిని, లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): ఇందుకూరుపేట మండలానికి చెందిన వర్షిత్ అనే చిన్నారి లివర్ సమస్యతో బాధపడుతుండగా రూ.10 లక్షల సీఎం సహాయనిధి చెక్కును నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది.

వేగవంతంగా పన్నుల వసూళ్లు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలం, తాగునీటి కుళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. ఎన్‌ఎంసీలోని రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోజూ ఉదయం నుంచి సచివాలయ పరిధిలో పర్యటించాలని, పన్ను బకాయిలున్న వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. నిర్దేశించిన సమయంలోగా చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరికలు చేయాలన్నారు. ప్రైవేట్ బిల్డింగ్‌ల్లో ఉన్న సచివాలయాలను ఆయా వార్డు ప్రజలకు సౌకర్యం కోసం వార్డు పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలుంటే తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, శ్రావణ్, శరత్, వంశీనాథ్‌రెడ్డి, సందీప్, కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

సీతారామస్వామి మందిరంలో ప్రవచనాలు

నెల్లూరు(బృందావనం): పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాలాజీనగర్ సీతారామస్వామి మందిరంలో జరుగుతున్న రామాయణ ప్రవచనాల్లో భాగంగా రామాయణంలో 'హనుమంతుడు' పాత్ర అంశంపై మంగళవారం ప్రముఖ ఉపన్యాసకులు డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు ఉపన్యసించారు. సభాపోషకులుగా అన్నవరం సత్యనారాయణ వ్యవహరించారు. కార్యక్రమంలో నలుబోలు బలరామయ్యనాయుడు, మెట్టు రామచంద్రప్రసాద్, ఎ.జయప్రకాష్, ఎస్.చంద్రశేఖర్, కె.మురళీకృష్ణ, ఎస్.శ్రీరామకృష్ణప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావును సన్మానించిన దృశ్యం